పార్వతమ్మగారు మా ఎదురింట్లోకి వచ్చి సరిగ్గా నాలుగు రోజులే అయింది. హనుమంత రావు గార్కి బ్యాంకిలో ఉద్యోగమని, ఆ దంపతులకి ఒక కొడుకు యిద్దరు కూతుళ్ళని తెలిసింది.

మా యిరుగు పొరుగు అంతా వెళ్ళి ఆమెతో పరిచయం చేసుకొచ్చారు. ఎప్పటి కప్పుడు వెళ్దామను కుంటూనే నాకు కుదరక పోయినా, అడిగిన అడక్క పోయినా మా యిరుగు పొరుగులు ఎప్పటి సమాచార మప్పుడు నాకు అందిస్తూనే వుంటారు.




కొత్తగా బదిలీ అయి వచ్చినా, ఇల్లు మారి మా పేటలోకి వచ్చినా మా చుట్టు పక్కల వాళ్ళకి వెళ్ళి పరిచయం చేసుకోక పోతే తోచదు. ఒక్క పరిచయమే అనేకంటే వారి పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకునే వరకు వదలరనడం సమంజసమో. ఒక్క తెలుసు కోవడమే కాదు అది అందరకీ చెప్పే వరకు కూడా నిద్ర పట్టదు. పోనీ తెలుసుకున్నది మాత్రం చెప్పి వూరు కుంటారా అంటే అదీ కాదు. తెలుసుకున్న విషయానికి మరింత మిర్చి, మసాలా రాసి పక్క వారికి చెప్పే వరకు తోచదు. వారి స్వభావాన్ని ఎరిగిన నేను 'ఊ' కొట్టి వూరుకునే దాన్ని.

ఉదయం లేచిన నాకు పార్వతమ్మగారి యింటి ముందు జనం గుంపుగా వుండడం చూసి ఏమిటీ అని చూస్తుండగా మా పక్క వాటా తాయారమ్మ పరిగెత్తు కొచ్చి "నీరజగారూ విన్నారా పాపం పార్వతమ్మగారబ్బాయి పోయాట్ట! చేతి కందొచ్చిన ఒక్కగానొక్క కొడుకు పాపం" అంటూ ఎంతో బాధ పడుతూ, కళ్ళ నీళ్ళెట్టుకొంటు చెప్పిన మాటలువిని కొయ్యబారి పోయాను. నిన్నింటి కింత వరకు చెప్పక పోయినా, కూరల సంచీ తోటో, కిరసనాయిలు డబ్బా తీసుకునో, వెళ్ళెళ్ళని బడి నుంచి వస్తూనో రోజుకి నాలుగైదు సార్లన్నా చూసే ఆ అబ్బాయి అంత అకస్మాత్తుగా చని పోవడమేమిటో" అన్న ఆశ్చర్యంతో పాటు, జాలి బాధ కలిగాయి. అంతా పార్వతమ్మగారింటికి వెళ్ళి పరామర్శించి వస్తున్నారు. ఇంత వరకు ఆమెతో పరిచయం అవకపోయిన బొత్తిగ ఎదురిల్లు బాగుండదని నేనూ ఓసారి వెళ్ళి పలకరించి వచ్చాను.

మర్నాడు సాపుగంటకి పక్కింటి వర్ధనమ్మగారు పరిగెత్తుకుంటు వచ్చి "నీరజ గారూ! మీరు వెళ్ళారా?" అంది 'ఊ' అన్న పదం పూర్తి కాకుండానే "చెట్టంత కొడుకు పోయినా బాధ పడుట లేదమ్మండీ! అసలు ఏడవనే లేదు!!" అంది "బుగ్గలు నొక్కుకుంటు" "అబ్బో చేస్తామండీ! ఏడ్పు ప్రయోజనం వుందా?" అన్నాను కాస్త ఒళ్ళు మండి! "ఆ అలా అనకండి అంతా అలా వుంటారా? గొప్ప ధైర్యంగా వుందిలెండి!" అంటూ వెళ్ళి పోతున్న ఆమెని చూసి విరాగ్గా లోపలి కొచ్చిన నాకూ అనిపించింది. పార్వతమ్మ

— వెంకట మహాలక్ష్మి

## పరిచయం

శ్రీమతి కందుకూరి వెంకట మహాలక్ష్మి స్వగ్రామం కాకినాడ. తండ్రి ఉద్యోగ రీత్యా కొంత కాలం బెంగాల్‌లో వుండడం. తరువాత భర్త శ్రీ కందుకూరి సూర్యనారాయణ గారి (ఆలిండియా రేడియో ఢిల్లీ తెలుగు న్యూస్ రీడర్) ఉద్యోగ రీత్యా గత 20 సంవత్సరాలుగా ఢిల్లీ నివాసం మూలంగా వీరికి, బెంగాలీ, తెలుగు, హిందీ భాషలు వచ్చు.



ఆంధ్ర దేశంలో మొట్ట మొదటి లేడీ మెజీషియన్‌గా పేరొందారు. ఢిల్లీ ఆకాశవాణిలో తెలుగు గీతాలు పాడడం. కథలు చదవడం, నాటికలలో పాల్గొనడం చేసారు.

ఢిల్లీలో వనితా జ్యోతి ఆనరరీ కరస్పాండెంట్‌గా ఎందరో ప్రముఖులను ఇంటర్వ్యూ చేసారు. కొంత కాలం రష్యాలో కూడా వుండి వచ్చారు.

బాధపడుతున్నట్లు లేదని. పెద్దపిల్ల మాత్రం అన్నగారి శవం మీద పడి గోలగోల పెడుతోంది. రెండోపిల్ల తల్లి పక్కనే కూర్చుంది. నే వెళ్ళి నప్పుడు." విన్నావా నీరజమ్మా! ఈ వింత! పద్దెనిమిదేళ్ళ కొడుకు పోయాడా? బాధ పడటం లేదు సరికదా! ఇవాళ బజ్జీలు వండుకుని తిన్నారట, వీళ్ళ ధైర్యం తగులడా— మాపని మనిషి, వీళ్ళ పనిమనిషి ఒక్కత్తేగా— అది చెప్తుంటే ఆశ్చర్యం వేసిందనుకో!" అంటు చెప్తున్న శేషమ్మగారి మాటలకి చిన్నగా నవ్వడం తప్ప ఏమీ అనలేక పోయాను. "రోజు టిఫిన్ అలవాటైన మనుష్యులు ఎవరేనా పోయారని టిఫిన్ మానేస్తారా?" అనుకున్నాను నాలోనేనే, ఆమె నోట్లో నోరెట్టడం యిష్టం లేక.

ఇలా ప్రతీ రోజూ ఒ యిల్లాలు వచ్చి పార్వతమ్మ గారు కొడుకు పోయినా ఎంత మొండిగా తిని, తిరుగు తోంది చెప్పి వెళ్తున్నారు.

వనజమ్మగారింట్లో బొమ్మల కొలువు పేరంటానికి ఆ పేట వాళ్ళం అంతా వెళ్ళాం. అప్పుడే వచ్చింది పార్వతమ్మగారు కూడా ఆఖరి పిల్లతో తాంబూలం పుచ్చుకుని వెళ్ళిందో లేదో అమ్మలక్కలంతా ప్రారంభించారు. మళ్ళీ అదే ప్రస్తావన తీసుకొస్తు— 'బాగుండదని పిల్చాను. నిజంగా పేరంటాని కొస్తుందనుకోలేదుస్మీ' అంటు వనజమ్మ, "లక్షణంగా స్వీట్లు పోట్లతో ఇంట్లో పండగలు చేసుకుంటుంటే పేరంటానికి రాదూ?" మరో యిల్లాలి కామెంట్. "అయినా పిల్లాడు పోయి నెల్లాళ్లన్నా అవకుండా వీధిని పడటానికి ఎలా ముఖం చెల్లుతుంది బాబూ?" మరో ముత్తయిదువ ప్రశ్న. ఇలా సాగుతున్న ఆ ధోరణి యింక వినలేక నేను "పోనిస్తురూ. ఏడిస్తే పోయిన పిల్లా డొస్తాడా? తిండీ, నిద్ర మానేస్తే వస్తాడా? మనసు మరల్చుకుని మిగతా పిల్లల కోసం ధైర్యంగా వుండకపోతే ఏం చేస్తుందాయిల్లాలు?" అన్న నాకేసి కొందరు మూతి విరుస్తూ, మరి కొందరు ఎగతాలిగా నవ్వుతు చూసారు. వాళ్ళ వేళా కోళానికి వళ్ళు మండిన నేను ఆ రోజు వాళ్ళతో గట్టిగానే వాదించి, గొడవ పడి యింటి కొచ్చిన నాకు మా యిరుగు పొరుగు అంటే చిరాకుతోపాటు పార్వతమ్మ గారంటే మరింత అభిమానం, సానుభూతి ఎక్కువయ్యాయి. దాంతో ఆమెతో స్నేహం కూడా ఎక్కువ యింది.

మర్నాడు ఏమీ తోచక పార్వతమ్మగారింటి కెళ్ళాను. మా యిద్దరి మధ్యా కాస్త చనువు పెరిగడంతో పార్వతమ్మ ఆ కబురు, ఈ కబురు చెప్తూ తను హనుమంత రావుగారి రెండో భార్యనని, మొదటి భార్య సంతతి ఓ కొడుకు కూతరు అని, తనకి ఒక ఆడపిల్లని చెప్పిన మాటలు విన్న నాకు చెవులో సీసం పోసినట్టయి, ఆ తరవాత ఆమె ఏం మాట్లాడిందో చెవికెక్కక గబగబా యింటి కొచ్చేసాను.

"ఏం నీరూ! అలా వున్న వేం? పరాగ్గా, చిరాగ్గా వున్న వేమిటి వాళ?" అన్న ప్రశ్నకి మా పేటవాళ్ళంత పార్వతమ్మ గార్ని కొడుకు పోయాకే ఆడిన మాటలు, పేరంటంలో వాళ్ళతో వాదించి, గొడవ పెట్టుకు రావడం గురించి చెప్తుంటే "దాని కెందుకు బాధ పడడం? మంచిపనే చేసావుగా! వాళ్ళ నోళ్ళు మూయించావూ!" అని మా వారు నన్ను పొగుడు తుంటే ఒళ్ళు మండి "అది కాదండీ! వాళ్ళన్నది నిజమే! అని ఋజువయింది. పోయాడూ! ఆ అబ్బాయి పార్వతమ్మ సవతి కొడుకుట! అందుకే రాయిలా కూర్చుంది ఏడవకుండా ! పాపం సొంత చెల్లెలు ఒకటే గోల. వున్న ఒక్క అన్నగారూ పోయాడు. పాపం రక్తసంబంధం గనకనే ఆ పిల్ల గోల గోల పెట్టింది. అవునుగానీ మనం యిల్లు మారిపోదామండీ!" అన్న నా మాటలకి ఆశ్చర్య పోతూ "ఎందుకు! ఇంత చవకలో యిల్లెక్కడ దొరుకుతాయి? అయినా ఇంత తొందరగా నీకెందుకు యిల్లు మార వలసొస్తోంది!" అన్న మావారి మాటలకి "రేపీ విషయం మన వీధిలో తెలిస్తే నన్ను దుయ్య బడతారు. అనవసరంగా వాళ్ళతో గొడవ పెట్టుకున్నాను. నీకేం తెలుసు వాళ్ళాడిన మాటలో నిజం వుందని. బాబ్బాబూ మీ ఆఫీసులో ఇల్లు గురించి నలుగురికీ చెప్పి చూడండి! వీలయినంత తొందర్లో మారి పోదాం!" అంటున్న నా మాటలకి నవ్వుతూ చూస్తున్న మా వారివైపు ఉక్కురోషంగా చూడటం తప్ప ఏం చెయ్యగలను??

(ఈ కథ రచయిత్రి వ్రాసిన 60 వ కథ ఇంతకు ముందు వ్రాసిన 59 కథలు వివిధ వార మాస పత్రికలలో ప్రచురితం అయ్యాయి.)

### నన్నడిగితే...

చదువూ సంధ్యలు నేర్పని షబానో ధైర్యంగా నిలబడి ప్రాథమిక హక్కుల కోసం పోరాడింది.



చట్టాన్ని మార్పించింది. ఒంటరిగా ధైర్యంగా పోరాడింది. నా దృష్టిలో ఈమె ప్రధానిగా వుండ తగిన వ్యక్తి.

— రేణుకా చౌదరి ఎం.పి.

(సాని పత్రికలో)

నేను జీవితంలో ఏ మహిళా చేయజాలనంతటి సర్దుబాటు చేసుకున్నాను. స్త్రీ విమోచన ఉద్యమంపై గుడ్డిగా నమ్మను. పురుషుడే అందరికన్నా అధికుడని భావిస్తున్నాను. స్త్రీ ఒంటరిగా వుండడం, ఒంటరిగా



జీవించాలనుకోవడం మంచిది కాదని నా అభిప్రాయం. ఈ ప్రపంచమే పురుషాధిక్యతగలది. మగవాడు ఎందర్ని వివాహామాడినా ఎవరూ అడగరు. కానీ ఒక స్త్రీ తనకు నచ్చిన వ్యక్తిని వివాహామాడితే ఎన్నెన్నో ప్రశ్నలు వేస్తారు.

— జయప్రద